క్లుప్తంగా

సత్యదేవుని సన్నిధికి పాదయాత్ర



అన్నవరానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

కాట్రేనికోన: మండలంలోని పల్లం, చిర్రయానం, కొత్తపాలెం, మొల్లేటిమొగ్గ గ్రామాల నుంచి సత్యదేవుని భక్తులు మాలలు వేసి పాదయాత్రగా అన్నవరం బయలు దేరారు. పల్లం గ్రామానికి చెందిన కోలా మీరయ్య ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా సత్యదేవుని మాలధారణ చేపట్టిన భక్తులు పాద యాత్రగా వెళుతున్నారు. హిందూ మత పరిరక్షణ, సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు భక్తులు తెలిపారు.

దీన్ దయాళ్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శరణ్యకు బహుమతి అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాగ్దేవి స్కూలులో సోమవారం నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పరీక్షకు 278 మంది విద్యార్థులు హాజరయ్యారని పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ స్కాలర్ షిప్ (లెవెల్-1) పరీక్షలో విజేతగా వాగ్దేవి స్కూలు 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ శ్రీవల్లి శరణ్య ఉత్తీర్ణత సాధించి లెవెల్-2కు ఎంపికైందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగిన ఈ స్కాలర్ షిప్ పరీక్షకు మొత్తం 191 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి లెవెల్-2కి ఎంపికయ్యారని సూపరింటెండెంట్ వెల్లడించారు. సర్కిల్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్‌గా పోస్టల్‌శాఖ అందిస్తుందని తెలిపారు.

గృహాల ఆన్‌లైన్‌ను వేగవంతం చేయాలి



గృహాల ఆన్‌లైన్‌పై ఆరా తీస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

తాళ్లరేవు: ప్రభుత్వం చేపట్టిన గృహాల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ అన్నామణి ఆదేశించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని సుర్ల, కోరంగి పంచాయతీలను సందర్శించారు. ఇంటిపన్నుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు కోరంగి పంచాయతీలో సుమారు 900 గృహాలను ఆన్‌లైన్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమణ తెలియజేశారు. పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఈ నెల 30కి పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

అల్లవరం: 4 నుంచి 8 నెలలు నిండిన పెయ్యి, దూడలకు బ్రూసెలోసిస్ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి కొమ్ము వెంకటరావు అన్నారు. మండల పశు వైద్యాధికారి మేడిద నారాయణరావు ఆధ్వర్యంలో గోడితిప్ప, ఎంట్రుకోన గ్రామాల్లో పశువులు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటరావు ముఖ్యఅతిథిగా హాజరై కోళ్ల పెంపకం దారులు, పాడి రైతులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. పశు సంవర్ధక సహాయకులు శివ, వెంకటేష్, హేమలత, బొక్కా శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేదీప్యమానం

అమలాపురం టౌన్: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని శ్రీ బాల విద్యార్థి గణపతి ఆలయ ప్రాంగణంలో రాత్రి అఖండ దీపాలంకరణ గావించిన భక్తులు ఆ ప్రాంతాన్ని దేదీప్యమానం చేశారు. తొలుత గణపతికి కార్తిక పూజలు చేసి ఆ తర్వాత దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ ప్రతినిధులు అందించారు.



దుడ్డివారి అగ్రహారంలో దీపాలంకరణ చేస్తున్న మహిళలు

అన్నదాతకు వరుణ గండం..!

- తుపాను హెచ్చరికతో అలముకున్న ఆందోళన
- భారీ వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం
- వరి పనలను ఒబ్బిడి చేసుకుంటున్న రైతన్నలు



దేవగుప్తంలో వరిపనలను ఒబ్బిడి చేస్తున్న కూలీలు

అల్లవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఖరీఫ్ పంటపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఇప్పటికే తీరం వెంబడి చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం నుంచి వాతావరణం మరింతగా మారి బుధ, గురు వారాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి దక్కదేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట చేతికి వచ్చే దశలో ఉంది. ఖరీఫ్‌లో ముందస్తుగా వరి నాట్లు వేసిన ప్రాంతాల్లో వరికోతలు ఇప్పటికే ప్రారంభించారు. మెరక ప్రాంతాల్లో యంత్రాల సహాయంతో ఒబ్బిడి చేస్తుండగా, పల్లపు ప్రాంతాల్లో కూలీల సహాయంతో వరి కోతలు చేపట్టారు. అమలాపురం రూరల్ మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అల్లవరం మండలంలో అడపాదడపా వరి కోతలు ప్రారంభించారు. ఉప్పలగుప్తం మండలంలో అక్కడక్కడా కోతలు ప్రారంభమయ్యాయి. అల్పపీడనం ప్రభావంతో ఇప్పుడు వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వరికోతలు ముగించుకున్న రైతులు వరి పనలను ఒబ్బిడి చేసుకుని పంటను కాపాడుకునేందుకు పనులను ముమ్మరంగా చేపట్టారు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభం కావడానికి మరో పది రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో వర్షాలు కురిస్తే వరి పంట పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను ఒబ్బిడి చేసుకునే ప్రతిసారి వర్షాలు, తుపాన్లతో తీవ్రంగా నష్ట పోతున్నామని వాపోతున్నారు.



ఉప్పలగుప్తంలో యంత్రాల సాయంతో ధాన్యాన్ని గట్టుకు చేర్చుతున్న దృశ్యం



కళ్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

కోతలు వాయిదా వేసుకోవాలి



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించాం. కోత యంత్రాలు అందుబాటులో ఉంటే ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని పచ్చి ధాన్యాన్ని నిల్వ చేయకుండా మార్కెట్ చేసుకోవాలని సూచిస్తున్నాం. డిసెంబర్ 2 వరకు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయకుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి, అల్లవరం.

నేడు న్యాయ అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ వి.నరేష్ తెలిపారు. ఇదే లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అక్షరాస్యత శిబిరాన్ని సైతం నిర్వహిస్తామని న్యాయమూర్తి వివరించారు. ఈ సదస్సు, శిబిరానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు హాజరు కావాలని కోరారు.

యువ ఉత్సవ్ విజయవంతానికి పిలుపు

యానాం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వచ్చే నెల 3న నిర్వహించనున్న జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌లో అంతా పాల్గొనాలని సోమవారం జిల్లా యువజన విభాగం అధికారి తిర్రి గోపి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో యువ ఉత్సవ్‌లో ఇండియా-2027 అనే అంశంపై పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి బండారు ప్రచారం

ముమ్మిడివరం: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి బండారు రామమోహన్‌రావు సోమవారం ముమ్మిడివరం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు తిరిగి గ్రాడ్యుయేట్ ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పోలిశెట్టి సురేష్‌ను అమలాపురం ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు సురేష్ వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అయినవిల్లి మండలంలో ముగ్గురు పాత నేరస్తులను సైతం బైండోవర్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ ముగ్గురు నిందితులను అయినవిల్లి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని పేర్కొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రతినిధులు

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు డిమాండ్

అమలాపురం టౌన్: రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. దీనితో పాటు నిరుద్యోగ భృతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చుకోవాలని కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్య నాయకులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సైతం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళంలో 2025 ఫిబ్రవరి 6 నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతాయని రాజేంద్రబాబు తెలిపారు. ఈ మహా సభలకు జిల్లా నుంచి ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఎస్టీయూ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు విజయాన్ని కాంక్షిస్తూ రాజేంద్రబాబు ప్రచారం చేశారు.

మత్స్యయోజన ద్వారా ఆర్థిక సాయం

యానాం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా ఆటో ప్రమాదానికి గురైన వ్యక్తి కుటుంబానికి సోమవారం రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. పట్టణ పరిధిలోని తోటవారివీధికి చెందిన సంగాడి వెంకట నరసింహస్వామి గత ఏడాది ప్రమాదానికి గురయ్యాడు. దీంతో ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.5 లక్షల సహాయాన్ని క్షతగాత్రుడి భార్య సంగాడి కాసురత్నానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

బాడీబిల్డింగ్‌లో ప్రతిభ

యానాం: నియోజకవర్గ పరిధి తీరప్రాంత గ్రామం సావిత్రినగర్‌కు చెందిన సంగాడి రమేష్ బాడీబిల్డింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన డెక్కన్‌క్లాసిక్ -2024 ఓపెన్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో 85 కేజీల విభాగంలో సుమారు 20 మంది పోటీపడ్డారు. ఈ పోటీల్లో రమేష్ కు ద్వితీయస్థానం లభించింది. తనను ప్రోత్సహించిన స్థానిక నాయకుడు అర్దాని దినేష్, కాకినాడకు చెందిన కోచ్ మహ్మద్ మనోజ్‌లకు రమేష్ కృతజ్ఞతలు తెలిపాడు.



పతకాలతో బాడీబిల్డర్ రమేష్

అగ్ని ప్రమాదంలో గృహం దగ్ధం

యానాం: యానాం నియోజకవర్గ పరిధి కనకాలపేట గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో దుబ్బుగడ్డి గృహం దగ్ధం కావడంతో సర్వం కోల్పోయి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోన వెంకన్నబాబు అనే వ్యక్తి గృహంలో ఆచంట వీరబాబు కుటుంబం అద్దెకు ఉంటున్నారు. సోమవారం తెల్లవారు జామున వీరబాబు ఆయన భార్య కార్తికమాస పూజలకు దేవాలయం వద్దకు వెళ్లారు. ఈలోగా ఒక్కసారిగా ఇంట్లో అగ్నికీలలు వ్యాపించి గృహం పూర్తిగా దగ్ధమయ్యింది. ఇంట్లో ఉన్న వీరబాబు కుమారుడు ఆచంట మహేష్ ప్రమాదాన్ని గమనించి బయటకు పరుగులు తీశాడు. స్థానికులు యానాం అగ్నిమాపక దళంకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

నామినేటెడ్ ఎమ్మెల్యేలకు ఆహ్వానం తప్పనిసరి

యానాం: ప్రభుత్వ కార్యక్రమాలకు శాసన సభ్యులతో పాటు నామినేటెడ్ ఎమ్మెల్యేలను సైతం ఆహ్వానించాలని సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ కాన్ఫిడెన్షియల్ అండ్ కేబినెట్ శాఖ కార్యదర్శి ఎం కన్నన్ ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదని పలువురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అధికారిక ప్రజా కార్యక్రమాలకు ఆయా ని యోజకవర్గ శాసనసభకు ఎన్నికైన శాసన సభ్యునితో పాటు నామినేటెడ్ శాసన సభ్యుడిని సైతం ఆహ్వానించాలని వేదికపై ప్రత్యేకంగా సీటు ఏర్పాటు చేసి ఆహ్వానపత్రంపై వారి పేరును ముద్రించాలని ఉత్తర్వు ల్లో పేర్కొన్నారు. ఈ విషయంలో ఏదైనా ఉల్లంఘన లు జరిగితే తీవ్రంగా పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు.

కరాటే పోటీల్లో మెరిసిన విద్యార్థిని

యానాం: 24వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక రీజెన్సీ విద్యార్థిని నాగాబట్ల వెంకటపద్మజ భారతి వెండి పతకాన్ని సాధించిందని ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 25న రామచంద్రపురంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని పద్మజ పాల్గొని విశేష ప్రతిభ కనబరిచిందన్నారు. పద్మజను విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ జీఎస్ నాయుడు, సత్యేంద్రప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో పునర్ నిర్మిస్తున్న శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయానికి సంబంధించి గ్రామానికి చేరుకున్న అయ్యప్ప స్వామి, ఇతర దేవాతామూర్తుల విగ్రహాలను సోమవారం ఘనంగా ఊరేగించారు. తమిళనాడులోని మహాబలిపురం నుంచి రాతి విగ్రహాలు రాగా తిరుపతి నుంచి అయ్యప్పస్వామివారి పంచలోహ విగ్రహం, తెనాలి నుంచి ధ్వజస్తంభం వచ్చాయి. వాటిని గురుస్వాముల పర్యవేక్షణలో స్థానిక నాయకులు, అయ్యప్పస్వాములు కాపులపాలెం, కనకాలపేట గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలి

ముమ్మిడివరం: ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో రజకులకు ప్రాధాన్యం కల్పించాలని ముమ్మిడివరం తాలుకా రజక సంఘ సమావేశం విజ్ఞప్తి చేసింది. ముమ్మిడివరం సంఘ కార్యాలయంలో సోమవారం సంఘ మండల అధ్యక్షుడు ముమ్మిడివరపు రాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. రజకుల అభివృద్ధి ఎన్‌డీఏ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రజకుల రక్షణకు చట్టం కల్పించాలని, రజక చెరువులు ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది. సమావేశంలో గొల్లపల్లి ధర్మారావు, సామంతకుర్తి సుబ్బారావు, కామెడి నాగేశ్వరరావు, సామంతకుర్తి సూర్యనారాయణ, కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, కామెడి మణికంఠ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నీలకంధరా.. దీన బాంధవా

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల అన్నసమారాధనలు
- దీప కాంతులతో శోభాయమానం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజల్లో భక్తులు

అమలాపురం టౌన్: అమలాపురంలో పురాతన శివ క్షేత్రమైన చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివ లింగానికి 2500 లీటర్ల పాలు, 21 రకాల పండ్ల రసాలు తదితర ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. తెల్లవారు జాము 2 గంటల నుంచే అభిషేకాలు మొదలయ్యాయి. వేద పండితుల శివ పంచాక్షరీ మంత్రం పఠనంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. బ్రహ్మశ్రీ భళ్లమూడి దివాకరశాస్త్రి బ్రహ్మత్వంలో 11 మంది అర్చక స్వాములు ఈ క్రతువును గావించారు. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ ఆలయం భక్తులతో పోటెత్తింది. రాత్రి వేళ మహిళలు ఆలయ ప్రాంగణంలో వేలాదిగా కార్తిక దీపాలు వెలిగించి ఆ ప్రాంతాన్ని కాంతిమయం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కార్తిక ఏర్పాట్లు చేశారు. ఏలూరి అయ్యప్ప, తోట శ్రీను, దున్నాల బాబి తదితరులు భక్తులకు సేవలు అందించారు. పట్టణంలోని చంద్రమౌళేశ్వర స్వామి, సిద్ధేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లరేవు: కార్తికమాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పవిత్ర నదీ స్నానాలాచరించి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. నీలపల్లిలో మీనాక్షి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి, చొల్లంగి శ్రీ రాజరాజేశ్వరీ సహిత సోమేశ్వరస్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామి, పాతకోరంగి బాలా త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి, నీలపల్లి మీనాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి, కొత్తకోరంగి వనదుర్గ సమేత విశ్వేశ్వరస్వామి తదితర ఆలయాలల్లో విశేష పూజలు జరిగాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలో పవిత్ర కార్తిక దీపాలను వెలిగించారు. సాయంత్రం సుంకరపాలెం శివాలయంలో స్వామివారికి అర్చకులు శ్రీకంఠం భీమేశ్వరశర్మ, ప్రసాద్‌శర్మల నేతృత్వంలో పంచ హారతుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఐ.పోలవరం: శివనామస్మరణతో మండలంలోని శివాలయాలు మార్మోగాయి. కార్తికమాసం నాలుగో సోమవారం కావడంతో భక్తులతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్థానిక గౌతమీ గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి కార్తిక దీపాలను వదిలారు. భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు సత్యసాయి సేవకులు విశేష సేవలు అందించారు. కేశనకుర్రుపాలెం శివాలయంలో కార్తికమాసం నెల రోజులపాటు చేపట్టిన అభిషేకాలు, కుంకుమ పూజలు అకట్టుకుంటున్నాయి. కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, గుత్తినదీవి, ఎదుర్లంక గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని గొల్లవిల్లి, ఎస్.కొత్తపల్లి, మునిపల్లి, భీమనపల్లి, చల్లపల్లి, విలసవిల్లి గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి శివాలయాల వద్ద బారులు తీరారు. ప్రత్యేక అభిషేకాలు, దీపారాధనలు చేశారు.

కాట్రేనికోన: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే గౌతమీ గోదావరి నది కుండలేశ్వరం రేవులో స్నానాలాచరించి రావిచెట్టు చుట్టూ ప్రదర్శనల అనంతరం దీపారాధన చేశారు. అనంతరం పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద సామూహిక అన్న ప్రసాద వితరణను దాతలు ఏర్పాటు చేశారు.




అల్లవరంలోని మల్లేశ్వరస్వామికి బిల్వార్చన చేస్తున్న వేద పండితులు

ముమ్మిడివరం: కార్తికమాసం ఆఖరి సోమవారం కావడంతో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేకువ జాము నుంచే వృద్ధ గౌతమీ నదీపాయలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో అయినాపురం శ్రీ ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి శ్రీపార్వతీ గౌతమేశ్వర స్వామి, కొమానపల్లి శ్రీపార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

అల్లవరం: కార్తికమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనానికి బారులు తీశారు. కార్తికమాసం చివరి సోమవారం కావడంతో ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవగుప్తం, అల్లవరం, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం, లక్ష్మణేశ్వరం శివాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అల్లవరంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళంపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు.



కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద భక్తులు



మురమళ్ల వీరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు



అమలాపురం చెన్నమల్లేశ్వరస్వామిని పండ్ల రసాలతో అభిషేకిస్తున్న అర్చకులు



సుంకరపాలెంలో పూజలందుకున్న వీరేశ్వరస్వామి



గొల్లవిల్లిలో ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి